క్లుప్తంగా

యువతి వివాహానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి మేస్త్రీ బాలరాజు కూతురు కల్పన వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ శుక్రవారం రూ.21 వేల నగదుతో పాటు పట్టుచీరను బహూకరించారు. ఆదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు నర్సింహ, రాంచంద్రయ్య, మహేశ్, కుమార్‌గౌడ్, పాండునాయక్, మహేశ్‌గౌడ్, అంజి, రాజా, జగన్, శ్రీకాంత్, శ్రీను, వెంకటేశ్, యాదయ్య, అంజయ్య, నర్సింహ ఉన్నారు.

పాఠశాలలకు చేరిన నోటు పుస్తకాలు



పుస్తకాలు తీసుకుంటున్న హెచ్‌ఎం

యాచారం: మండల పరిధి ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు చేరాయి. పాఠశాలల పునఃప్రారంభానికి మరో పది రోజుల సమయం ఉన్న నేపథ్యంలో ముందుగానే అన్ని బడులకు ప్రభుత్వం పుస్తకాలు సరఫరా చేస్తోంది. కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు శుక్రవారం చేరిన రాత పుస్తకాలను హెచ్‌ఎం పాండురంగారెడ్డి భద్రపర్చారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం పలు చోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు రాఘవేంద్ర హోమ్స్, ట్రెజరర్ ఎన్‌క్లేవ్స్, వైష్ణవి ఎన్‌క్లేవ్, అగ్రికల్చర్ లైన్‌కు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కమ్మగూడ, ఎంఎల్‌ఆర్ కాలనీ, బృందావనం కాలనీ, కొత్తగడ్డ, శ్రీపురం కాలనీ, బాలాజీ హోమ్స్, వెంకటేశ్వర కాలనీ, ప్లాటినం సిటీ, రాజలక్ష్మీ నగర్, కింగ్స్ వే, లిబ్రా షెల్టర్స్, వెంకటాద్రి నివాస్, ఎఎంఆర్ కాలనీ, కృష్ణా హోమ్స్, సెవెన్ హిల్స్, సిద్ధార్థ కాలనీ, ఎంవీఎస్ఆర్ మెయిన్ రోడ్, మాతృశ్రీ నగర్, బండల్ మడుగు, శాంతినగర్, వైకుంఠపురం, శ్రీరామ ఎన్‌క్లేవ్, ప్రెస్ కాలనీ, సలీం వెంచర్, సాయిరామ్ నగర్, వినాయక నగర్ కాలనీలోనూ సరఫరా ఉండదని తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్మారక పోటీల్లో మంచాల విజయం



విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మాజీ నోడల్ ఆఫీసర్ ఎన్. శ్రీనివాస్‌బాబు స్మారకార్థం పీఆర్టీయూ ఆధ్వర్యంలో గురుకుల విద్యాపీఠ్‌లో శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల ఉపాధ్యాయులు టోర్నీలో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. పరమేశ్ కెప్టెన్‌గా వ్యవహరించిన పట్నం జట్టు.. 37 పరుగులతో విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో యాచారంపై మంచాల గెలుపొందింది. తుది పోరులో పట్నం టీంపై మంచాల గెలిచింది. కప్‌ను కైవసం చేసుకుంది. మండల విద్యాధికారి హీర్యానాయక్, విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రాజు, యాదగిరి, శ్రీనివా, గోవర్ధన్, మల్లేశ్, ఆనంద్‌లు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

హుడాకాంప్లెక్స్: వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధి సాయికృష్ణనగర్ కాలనీలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత, వాటర్‌వర్క్స్, శానిటేషన్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బస్తీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. వానాకాలంలో మురుగునీటి సమస్య తలెత్తకుండా పూడికతీత పనులు చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని చెప్పారు.

విపణి ఏర్పాటు.. రైతుకు తోడ్పాటు



యాచారం మండల కేంద్రం

కూరగాయలు పండించే రైతులకు ఊరట లభించనుంది. స్థానికంగా సాగు చేసి, 50 కి.మీ. దూరంలోని మాదన్నపేట, సరూర్ నగర్ రైతు బజార్లకు తరలించి విక్రయిస్తున్న వారికి ఇక మీదట ఆ కష్టాలు తప్పనున్నాయి. మండల కేంద్రంలో మార్కెట్ నిర్మించి, ఉద్యాన పంటల సాగుదారులకు మరింత తోడ్పాటునందించేందుకు రైతు సంక్షేమ కమిషన్ దృష్టి సారించింది.

కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సన్నాహాలు

- యాచారం నుంచే వ్యాపారులు కొనుగోలు చేసేలా ప్రణాళిక
- స్థలం పరిశీలిస్తున్న రైతు కమిషన్
- సాగుదారులకు ఊరట, ఉపాధి మెరుగు
- పంచాయతీకి సమకూరనున్న ఆదాయం

యాచారం: కూరగాయలు, ఆకుకూరల ఉత్పత్తిని మరింత పెంచేందుకు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సంయుక్తంగా.. మండలంలోని మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా సుమారు 150 మంది రైతులకు డ్రిప్ పరికరాలను అందజేసింది. వారిని మరింత ప్రోత్సహించేందుకు నాబార్డ్ సహకారంతో సాగు పనిముట్లతో పాటు రాయితీపై విత్తనాలు, ఫర్టిలైజర్స్‌ను అందజేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అయితే ఉద్యాన పంటల సాగు ఉత్పత్తి పెంచినప్పటికీ.. స్థానికంగా విక్రయించేందుకు మార్కెట్ లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. దీంతో లాభం సంగతి ఎలా ఉన్నా.. కొన్నిసార్లు కనీస రవాణా చార్జీలు దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా మార్కెట్ నిర్మాణానికి బీజం పడింది.

స్థల పరిశీలన

పైలెట్ గ్రామాల్లోని రైతులు పండించిన కూరగాయలను స్థానికంగా విక్రయించేందుకు రైతు కమిషన్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకోసం మండల కేంద్రం సాగర్‌రోడ్డుపై యాచారం పీఏసీఎస్, ఆర్టీసీ బస్టాండ్, ఎంపీడీఓ కార్యాలయాల సమీపాల్లో స్థలాలను పరిశీలన చేస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరా భూమి ధర రూ.రెండున్నర కోట్లకు పైగానే డిమాండ్ ఉంది. విపణి ఏర్పాటుకు అనువైన స్థలం దొరికితే సరి, లేదంటే అద్దె రూపేణా భూమి తీసుకుని ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ఇక్కడినుంచే కొనుగోళ్లు



నస్దిక్‌సింగారంలో టమాట పంట

యాచారం మండలం మొదటి నుంచి కూరగాయలు, ఆకుకూరల పంటల సాగకు ప్రసిద్ధి. పైలెట్ గ్రామాలు మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడలే కాకుండా మల్కీజ్‌గూడ, చింతుల్ల, చింతపట్ల, నల్లవెల్లి, మాల్, తక్కళ్లపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, నస్దిక్‌సింగారం, నందివనపర్తి, అయ్యవారిగూడెం గ్రామాల్లోని రైతులు వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తారు. వీరంతా నల్గొండ జిల్లా పరిధి వెంకటేశ్వరనగర్, జిల్లాలోని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్, నగరంలోని పలు మార్కెట్లకు తరలించి విక్రయిస్తుంటారు. ఇక మీదట అలా కాకుండా పలు ప్రాంతాల నుంచి వ్యాపారులను ఇక్కడికే రప్పించి, ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్లేలా చేయాలని రైతు కమిషన్ నిర్ణయించింది. దీంతో ఇక్కడి వారికి ఉపాధి దొరకడంతో పాటు, యాచారం గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

“ మూడు దశాబ్దాలుగా..



మార్కెట్ ఏర్పాటు చేసేందుకు రైతు కమిషన్ తీసుకున్న నిర్ణయం చాలా బాగుంది. దీంతో మాకు దూర, రవాణా భారం తప్పుతుంది. సమయం ఆదా అవుతుంది. కూరగాయాల సాగుకు మరింత తోడ్పాటునందించినట్లు అవుతుంది. 30 ఏళ్లుగా పుదీన సాగు చేస్తున్నాం. ప్రస్తుతం మాదన్నపేటకు తరలించి విక్రయిస్తున్నాం.

– బాలరాజ్ యాదవ్, రైతు, మొండిగౌరెల్లి

నల్లగొండ మార్కెట్‌కు..



ఏటా నాలుగైదు ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తాను. యాచారంలో మార్కెట్ లేక, నల్లగొండ జిల్లా వేంకటేశ్వరనగర్ కూరగాయల మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నాం. లేదంటే 25 కిలోమీటర్ల దూరంలోని ఇబ్రహీంపట్నం మార్కెట్‌కు తీసుకెళ్తాం. కొన్నిసార్లు నగరానికి తరలిస్తాం. దీంతో చాలా ఇబ్బంది అవుతోంది.

– బీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

స్థల పరిశీలన



మండల కేంద్రంలో వ్యవసాయ రైతు కమిషన్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కానుంది. అందుకు అనుకూలమైన స్థల పరిశీలన జరుగుతోంది. దీని కోసం మరో రెండు రోజుల్లో వ్యవసాయ, ఉద్యాన, రైతు కమిషన్ ఉన్నతాధికారులు రానున్నారు. అనంతరం మార్కెట్ ఏర్పాటవుతుంది. మార్కెట్ నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు. పలువురికి ఉపాధి దక్కుతుంది.

– రవినాథ్, వ్యవసాయ అధికారి, యాచారం

ఆధునిక పద్ధతిలో అధిక దిగుబడి

- భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి
- కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు
- వ్యవసాయ పథకాల వివరణ



కడ్తాల్: రావిచేడ్‌లో వికసిత కృషి సంకల్ప్ అభియాన్‌లో శాస్త్రవేత్తలు, రైతులు

కడ్తాల్: ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ.. అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు అన్నారు. శుక్రవారం మండల పరిధి రావిచేడ్ గ్రామంలో పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో 'వికసిత కృషి సంకల్ప అభియాన్' పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నాగార్జునకుమార్, డాక్టర్ భార్గవి, డాక్టర్ ప్రియ, డాక్టర్ సుధీర్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ దిలీప్‌లు పథకం గురించి వివరించారు. వ్యవసాయ సాంకేతికత, నూతన విధానాలు, అధిక లాభం చేకూర్చే ఉద్యాన వన పంటల సాగు మెలకువలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్ ఆటో మెషిన్లను ఎలా ఉపయోగించాలో పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించాలని, వాటిలో ఉన్న పోషకాలను తెలుసుకుని, ఎరువుల సమతుల్యతను గమనించి, సాగు చేయాలని వెల్లడించారు. పశు సంపద అభివృద్ధి, వాటికి సోకే వ్యాధులు, గడ్డి జాతులు, వాటి పోషక విలువల గురించి సమగ్రంగా వివరించారు. వ్యవసాయ రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉన్న పథకాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు బాలకృష్ణ, రమేశ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలపై దృష్టి సారించాలి

రైతులు పంట మార్పిడి, అంతర పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ సునిత అన్నారు. వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో నిర్వహించారు. పర్యావరణ హిత వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు వాడటం ద్వారా భూమి ఫలదాయకత తగ్గిపోతుందని, నేలలు నిస్సారమై బీడుగా మారే ప్రమాదముందని తెలిపారు. ఆ పరిస్థితులను అధిగమించేందుకు వర్మి కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ఉత్తమమని, జీలుగ, జనుము కలియదున్నడం ద్వారా భూసార పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు.

రసీదులు భద్రం

నీటి ఎద్దడి పెరుగుతుండటంతో.. బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు రసీదులను భద్రపర్చుకోవాలని, తద్వారా ఆపత్కాలంలో పరిహారం పొందవచ్చని తెలిపారు. సుస్థిర సాగు పద్ధతులు, సాగులోని మెలుకులు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అభినవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, అభ్యుదయ రైతులు మల్లారెడ్డి, సత్యశీలారెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తులు పెంచడమే లక్ష్యం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగార్జున

మాడ్గుల: వ్యవసాయ ఉత్పత్తులు పెంచడమే వికసిత్ సంకల్ప్ అభియన్ పథకం లక్ష్యమని కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ఆర్.నాగార్జున తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అభియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్, ఆటోమిషన్లపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష, పోషకాలు, ఎరువుల సమతుల్యత గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, ప్రియ, విజయ, దిలీప్ మండల వ్యవసాయ అధికారి అరుణ కూమారి, విస్తరణ అధికారులు జోత్స్న, దుర్గా, భార్గవి, ప్రియాంక, నవ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

రైతులకు రసీదు ఇవ్వాలి: ఏఓ



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: ఎరువులు, విత్తనాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. సీడ్స్, వాటిని ఉత్పత్తి చేసిన సంస్థలు, ధ్రువీకరణ పత్రాలు తదితర వాటిని పరిశీలించారు. విత్తన నమూనాలు సేకరించి, నగరంలోని రాజేంద్రనగర్ ల్యాబ్‌కు పరిశీలన నిమిత్తం పంపించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. ఎరువు, విత్తనాలు రైతులకు విక్రయిస్తే.. వారికి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో దుకాణాల యజమానులు శేఖర్, రవి, వెంకటయ్య, జంగయ్య పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కందుకూరు: కార్మికుల సమస్యలపై జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ కోరారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని నేదునూరులో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. కార్మికుల రక్షణ కోసం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నిర్వీర్యం చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. పనికి తగిని కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మంచాల: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బండలేమూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజలందరూ కలిసి, మెలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుకోవాలని సూచించారు. మంచాలలోని పెద్దమ్మ తల్లి పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ, నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జెనిగె వెంకటేశ్, మంగ శ్రీనివాస్, వట్టి యాదయ్య, లొంగారి మల్లేశ్, మధుసూధన్‌రెడ్డి, మార సురేష్, యాదవ సంఘం కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి




డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

తుర్కయంజాల్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 167/1లోని 266 ఎకరాల భూముల్లో సాగు చేసుకుంటూ ఏక్‌సాల్ పట్టాలు కలిగి ఉన్న రైతులకు న్యాయం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు డి.కిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్ఓ సంగీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొహెడకు చెందిన 150 మంది రైతులకు ఏక్‌సాల్ పట్టాలను పంపిణీ చేసిందని, నాటి నుంచి ఆ కుటుంబాలు ఆ భూమిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కొంత కాలంగా ఈ భూమిని ఓ ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టాలనే ఉద్దేశంతో కొందరు ఉద్యోగులు యత్నిస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, రైతుల పేర్లను ఆన్‌లైన్ చేసి, పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.సత్యనారాయణ, కె.అరుణ్ కుమార్, జె.ఆశీర్వాదం, ఐ.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

- పులిమామిడి గ్రామస్తుల డిమాండ్



వెంచర్‌ను పరిశీలిస్తున్న ఎంపీఓ గీత తదితరులు

కందుకూరు: రోడ్డు సౌకర్యం కల్పించాలని మండల పరిధిలోని పులిమామిడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 138, 139లలో నలంద గార్డెన్స్ పేరుతో ఉన్న వెంచర్‌లో ఏర్పాటు చేసిన రహదారులను అందరూ ఉపయోగించుకునేలా అడ్డుగా ఉన్న కంచెను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామస్తులతో కలిసి ఆ వెంచర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు ఆ వెంచర్‌లోని రోడ్లతో పాటు పది శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లు రిజిస్ట్రేషన్ అయితే ఆ మార్గం నుంచి అటువైపు పొలాలకు వెళ్లడానికి ఎవరి అనుమతులు అవసరం ఉండదన్నారు. దీంతో రైతులకు దగ్గర దారి అవుతుందని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కరిస్తానని అధికారులు స్థానికులకు తెలిపారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



కడ్తాల్: ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు/ కడ్తాల్: నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలం గుర్లకుంటతండాలో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. నియోజకవర్గానికి 4500 ఇళ్లు మంజూరయ్యాయని, మొదటి విడతగా సొంత స్థలం ఉండి, ఇల్లులేని బీసీలకు రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇంటి నిర్మాణానికి విడతలుగా అందజేస్తుందని తెలిపారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు చందోజీ, శ్రీకాంత్‌రెడ్డి, రవినాయక్, మల్లేశ్‌గౌడ్, సత్యం యాదవ్, బ్రహ్మచారి, శ్రీను, మోహన్, ప్రభు, చెన్నయ్య, మల్లయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

ఆమనగల్లులో..

కాంగ్రెస్ పాలనలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్యలు అన్నారు. పట్టణంలోని 11వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్పుల శ్రీకాంత్, అలీం, మహేశ్, రాజు పాల్గొన్నారు.



ఆమనగల్లు: నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఇళ్లు నిర్మించుకోవాలి



ఎల్మినేడులో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్‌రెడ్డి, పట్నం శివశంకర్‌లు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, స్వామి, శ్రీశైలం, మంగ, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.